న్యూయార్క్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్ అబ్జర్వేషన్ డెక్‌మీద కలిసింది సుధ నాకు. స్టాట్యూ అఫ్ లిబర్టీని చూడటానికి టెలిస్కోప్‌లో వెయ్యడం కోసం జేబుల్లో డైమ్స్ వెదుక్కుంటూ వెనగ్గా చీర రెపరెప మంటే, తిరిగి చూశాను. మరుక్షణంలో నా ప్రసన్నత మాయమైంది ఆ నూటపేడో అంతస్తులో నుంచీ ఆ అమ్మాయిని కిందకు విసిరెయ్యాలనే బలీయమైన కోరికను ఎలా నిగ్రహించుకోగలిగానో నాకే తెలియదు. బహుశా నా జుగుప్స తాలూకు చిహ్నాలు ఆమెను బాగా గాయపర్చి ఉండాలి. కానీ ఆ చిన్నబోయిన మొహం నాలో ఎటువంటి జాలినీ కలిగించలేదు.

సుమారు ముప్పైఏళ్ళక్రితం దేవుడు ఓ అందమైన విగ్రహాన్ని సృష్టించి ప్రాణానికి బదులు విషం నింపి, ఆ వ్యక్తిని భూమ్మీదకు పంపితే, ఆమెను కన్న రాక్షసుడు, సుధ అనే తియ్యని పేరు తగిలించి మనుషుల మీదకు వదిలితే బలైపోయిన వాళ్ళలో నేనూ ఒకణ్ణి.

'శశీ' అందామె వారిస్తున్నట్టుగా.

వెయ్యబోయిన అడుగు ముందుకు పడలేదు నాకు.

'ఎప్పుడొచ్చావ్ ?'

'మొన్న'

'ఎక్కడుంటున్నావ్ ?'

'బంధువులింట్లో'

చిన్నగా నవ్విందామె 'నేనూ వెస్టర్న్‌లోనే దిగాను.'

ఆ హోటల్‌మీద అంతకు ముందు ఎప్పుడూలేని అసహ్యం కలిగింది.

'తెలిసీ ఎందుకడిగావ్. నన్ను వెంటాడుతున్నావా?' కటువుగా అన్నాను.

ఆమెకు ఉన్న ఆస్తి అహం. ప్రపంచంలో అందరికన్నా ఐశ్వర్యవంతురాలామె. తనను నొప్పించే ఏ చిన్న అవకాశాన్నీ నేను జారవిడువలేను.

'వెంటాడాల్సిన అవసరం నాకు లేదు శశీ. లోకం చాలా చిన్నది. చుట్టిరావడానికి రోజు పట్టదు. స్నేహితులను కలుసుకోవాలంటే వెంటపడనక్కర లేదు. అనుకోని సమావేశాలు అత్యంత సహజాలు.'

'మొదటిది. నేను నీ స్నేహితుణ్ణి కాను. స్నేహానికి అర్థం నువ్వనుకునేదే అయితే ఆ బంధానికి ఎటువంటి మధురిమా ఉండదు. రెండు. ఇంతకు ముందువరకూ మనిషి ముందు ప్రపంచం చాలా చిన్నది అని గర్వించేవాణ్ణి. మన ఈ కలయికతో అది మరీ ఇంత చిన్నదైపోయినందుకు విచారిస్తున్నాను.'



# చీకటి కోణాలు


వేములపల్లి మోహన్‌రావు • పి.వి.కృష్ణారావు

ఎదుటివాళ్ళను ఏడిపించడానికి మాటల కన్నా పదునైన అస్త్రాలు లేవు. వాటిని తట్టుకుని నిలబడగల శక్తి ఏ మానవ సంబంధాలకూ లేదు. తడిసిన కళ్ళను ఆమె పక్కకు మరల్చుకోవడమే నాకు అవకాశంగా భావించి గబగబా ముందుకు నడిచాను

నాకు తెలుసు. అవమానింపబడటం కన్నా ఆత్మహత్యే శ్రేయస్కరం కొందరికి. ఎక్స్‌ప్రెస్ లిఫ్ట్‌లో నేను గ్రౌండ్‌ఫ్లోర్‌కు దిగిన యాభై ఎనిమిది సెకన్లూ అన్ని యుగాలు.

* * *

లాంగ్ ఐలండ్‌లో పని పూర్తిచేసుకుని నేను జేఎఫ్‌కేకి వచ్చేప్పటికి ఎయిర్ ఫ్రాన్స్ ఫ్లైట్ టేకాఫ్‌కు రెడీగా ఉంది. బోర్డింగ్ కార్డు తీసుకుని చెకిన్ అయ్యాను. ఎయిర్ హోస్టెస్ చూపించిన సీట్లో కూర్చోబోతూ పక్కనున్న వ్యక్తిని చూసి త్రాచుపాముమీద కాలు పెట్టినవాడిలా అయిపోయాను. ఎకానమీ క్లాస్‌లోకి పారిపోదామనిపించింది.

'నేనేం దెయ్యాన్నీ, భూతాన్నీ కాదు నిన్ను మింగడానికి. కూర్చోవచ్చు' అంది సుధ.

'అయినా బాగుండేది. ఈ చిత్రహింసలకన్నా ఆకస్మిక మరణం చాలా ఆనందకరం కదూ' అన్నాను కోటు విప్పి ఎయిర్‌హోస్టెస్ కిస్తూ.

'నీ కెందుకింత ద్వేషం శశీ నామీద. నేనేం చేశాననీ?'

సూటిగా చూశాను ఆమె కళ్ళలోకి. వాటిలోని నిర్మలత్వం ఒక్కసారి నా పగమీద నీళ్ళు చల్లింది.... నేనే పొరపాటు పడ్డానేమో.

'నీకు తెలీదా. తెలియకుండానే మనుషుల్ని పొట్టన పెట్టుకున్నావా' అన్నాను.

ఓ నిమిషం మౌనంగా గడిచిపోయింది.

'అవున్లే. నువ్వు మాత్రం అందరిలాంటివాడివి కాదూ అందులోనూ మగవాడివి.'

మొహం పక్కకు తిప్పుకుందామె. నేనేం మాట్లాడలేదు. హాండ్‌బాగ్‌లో నుంచి కర్చీఫ్ తీసుకుంది .... అదే పరిమళం .... పదేళ్ళ క్రితం నాటి ఇంటిమేట్ పరిమళం.

లోకులు అనుకునేదే నీకు తెలుసు కానీ నిజమేమిటో కనుక్కునే ప్రయత్నం చేశావా ఎప్పుడైనా' అందామె మెల్లగా.

'నిజం నాకన్నా బాగా తెలిసినవాడెవడూ లేడు. కళ్ళు మూసుకుని పాలు తాగే పిల్లులకే ఉంటాయి భ్రమలు.'

నేను ఏ విషయాన్నైతే మర్చిపోవడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నానో, అదే నన్ను నీడలా వదలడం లేదు. కాలం మాన్పలేని గాయం ఒకటి నన్నిలా వేధిస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు.

'నాకు అన్నీ తెలుసనుకోవడం ఆ మనిషి అవివేకాన్నే సూచిస్తుంది' అందామె.

నేనేం మాట్లాడలేదు. కళ్ళు మూసుకున్నాను. పదేళ్ళ క్రితం....

* * *

'కూర్చో' అన్నాడు రామనాధరెడ్డి.

'ఫర్వాలేదు....చెప్పండి'

'ఏమిటి. కాలేజీ ప్రెసిడెంటుగా పోటీ చేస్తున్నావట.'

'అవును.'

'మా సుధ నిలబడుతోంది తెలుసుగా'

'తెలుసు.'

ఒక్కసారిగా లేచాడు తను.

"ఎన్ని గుండెలురా నీకు....అన్నీ తెలిసే తెగించావన్నమాట. చూస్తాను. మీ బాబు పనిచేసేది మా బావమరిది కృష్ణమూర్తి ఫాక్టరీలో. నీ చెల్లి చదివేది మన కాలేజీలో. మీ అమ్మకు మందులు కొనడానికి డబ్బుల్లేవని ఓ పక్క మీ నాన్న అఘోరిస్తుంటె, ప్రెసిడెంట్‌గిరీ కోసం పాకులాడుతావన్నమాట నువ్వు ....చూస్తాను. అదీ చూస్తాను.' లోపలికి వెళ్ళిపోయాడు.

ఓ నిమిషంపాటు ఆ విశాలమైన హాల్లో ఒంటరిగా నిలబడిపోయాను. నా పరిధులు నాకు తెలుసు. కొండను ఢీకొనడం కేవలం మూర్ఖత్వం. పదవి కోసం నా వాళ్ళందర్నీ బలిపెట్టుకోలేను.

మర్నాడు కాలేజీలో అందరూ దుమ్మెత్తిపోస్తున్నా వినకుండా నామినేషన్ ఉపసంహరించుకున్నాను

* * *

లాగి చెంపమీద కొట్టాడు అరుణ్. దెబ్బతో ఆ అమ్మాయికి కళ్ళు బైర్లుకమ్మాయి. ఒంట్లోని రక్తమంతా మొహంలో కేంద్రీకృతమైనంత ఎర్రబడిపోయిందామె. తెల్లబోయి చూస్తున్న మమ్మల్నందర్నీ వదిలేసి కారెక్కి వెళ్ళిపోయింది. తన స్నేహితురాళ్ళు 'సుధా సుధా' అని పిలుస్తున్నా వినిపించుకోకుండా.

అంతకుముందు, అరుణ్, రవీ, నేనూ మెట్లు దిగి వస్తున్నాం. కారిడార్ మలుపు తిరుగుతూ, చూసుకోకుండా ఆ అమ్మాయిని ఢీకొట్టాడు అరుణ్. ఆమె చేతిలో పుస్తకాలు కిందపడిపోయాయి.


'యూ బ్లడీ! కళ్ళు నెత్తికెక్కాయా' అందామె పొగరుగా.

సారీ చెప్పబోతున్నవాడల్లా ఆగిపోయాడతను.

'ఏమిట్రా అలా చూస్తావ్....ఎవరనుకున్నావ్ నన్ను. ఆడపిల్ల అంటే అలుసు కదూ మీ అందరికి. నేను తల్చుకుంటే మిమ్మల్నందర్నీ సున్నంలోకి ఎముకలేకుండా చేస్తాను బాస్టర్డ్స్.'

అంతే మరునిమిషం ఆ అమ్మాయి దవడ పేలిపోయింది.

'నీ కేమన్నా పిచ్చెక్కిందా!....




ఏమిటా పని' అన్నాను నేను అరుణ్ వైపు కోపంగా చూస్తూ

'లేకపోతే ఎంత గర్వంరా దానికి. దీని బాబు కమిటీ ప్రెసిడెంటయితే ఎవడికి గొప్ప! వీళ్ళకు కోట్లకొద్దీ డబ్బుంటే ఎవడికి లెక్క! అపోజిషన్ వాళ్ళమనే కదూ కడుపుమంట.... ఇంకో సారి అలా వాగమను. పళ్ళు రాలగొట్టి చేతికిస్తాను' అన్నాడు అరుణ్.

వాడు నాకు ఆరో ప్రాణం. నాకున్న ఒకే ఒక్క నిజమైన స్నేహితుడు.

'నీకు ఆవేశం తప్ప పర్యవసానాలు ఆలోచించే ఇంగితజ్ఞానం లేదురా. వాళ్ళకు ఎదురునిలబడి ఎంతకాలం బ్రతగ్గలవ్ .... చివరికి నష్టం ఎవరికి ?'

'చూడు శశీ – మనిషికి ఆత్మగౌరవం అనేది ఒకటుంటుంది. అది ఎవర్నీ దేన్నీ లక్ష్యపెట్టనివ్వదు. ఆఖరికి ప్రాణాల్నయినా సరే....'

అదే చివరిసారి నేను వాణ్ణి ప్రాణాలతో చూడటం.

* * *

విమానం హోరు నన్ను వర్తమానంలోకి తీసుకొచ్చింది. ఎదురుగా తెరమీద జాన్ వేన్ ఎవరెవర్నో చంపేస్తున్నాడు. పక్కకు తిరిగాను. సుధ కూడా సినిమా చూడటం లేదు గడ్డంకింద చెయ్యి పెట్టుకుని అనంతమైన శూన్యంలోకి చూస్తోంది.

నా చూపులు ఆమెను తాకాయి కాబోలు, ఇటు తిరిగింది. నిస్తేజమైన ఆ మొహంలో అర్థంకాని అనేక భావాలు.

నిట్టూర్చిందామె. ఏదో చెప్పడానికి ముందు అది ఉపోద్ఘాతమని నాకు తెలుసు.

'నిజం, వివేకం, మానవత్వం, ఇంగితం వీటన్నిటికీ ఓ పెద్ద శాపం ఉంది శశీ ఏమిటో తెలుసా అది. అజ్ఞాతవాసం. అవి ఎప్పుడో గానీ బయటకురావు. కానీ అప్పటికి జీవితాలే నాశనమైపోయి ఉంటాయి.'

అంతసేపు సాన్నిహిత్యం ఆమెమీద నాకు ఏళ్ళతరబడి పేరుకుపోయిన కక్షను కొద్ది కొద్దిగా కరిగిస్తోంది.

'అది కేవలం యాక్సిడెంటేననీ, నేను కావాలని చేయించింది కాదనీ అప్పుడూ ఎవరూ నమ్మలేదు. ఇప్పుడూ ఎవరూ నమ్మడంలేదు.'

రక్తంమడుగులో దొర్లుతున్న అరుణ్ శరీరం గుర్తొచ్చి నా పిడికిళ్ళు అప్రయత్నంగా బిగుసుకున్నాయి.

'నువ్వే ఆలోచించు.... ఆ ఇరుకు రోడ్డుమీద మాని కనీసం పాతిక లారీలైనా గంటకోసారి అటూ ఇటూ తిరుగుతుంటాయి. ఆ సంఘటన కేవలం యాదృచ్ఛికం కావడానికి వీల్లేదా? డాక్టర్లు కూడా సర్టిఫై చేశారు, డ్రైవర్ బాగా తాగి ఉన్నాడని!'

'సర్టిఫికెట్ల కేముంది! డబ్బుంటే ప్రపంచం మొత్తం సముద్రంలో మునిగిపోయినట్టు కాగితాలు సృష్టించవచ్చు' అన్నాను.

'నీ కర్థంకాదు శశీ నీ కెప్పటికీ అర్థం కాదు. నేను పొగరుబోతునైతే కావచ్చు. కానీ హంతకురాలిని కాలేదు. కాలేను. ఓ మనిషి ప్రాణాలు నిలువునా బలితీసుకునేంత రాక్షసత్వం నాలో లేదు చాలా సెన్సిటివ్' నేను.

'అవునట. మొత్తం మన ఊరంతా అదే విషయం చెప్పుకుంటున్నప్పటికీ.' నా ద్వేషాన్ని దాచుకునే ప్రయత్నం చెయ్యలేదు.

రెండు క్షణాలపాటు ఇంజన్ల శబ్దాలు మా మధ్య మౌనాన్ని కర్కశంగా కోశాయి.

స్టెర్ ఫ్రెష్‌తో చేతులు తుడుచుకుందామె. మెత్తని యుడికొలోన్ వాసన మా చుట్టూ అల్లుకుంది.

ఓడిపోతున్న లక్షణాలేవీ లేవు ఆ మొహంలో.

'పోన్లే శశీ....నీకో కథ చెపుతాను. చాలా ఇంటరెస్టింగ్. వింటావా' నా సమాధానంకోసం ఆగలేదామె.

"ఆ దుర్ఘటన జరిగిన నెల రోజుల కనుకుంటాను.... ఆ రోజు సాయంత్రం మన కాలేజీ వెనక గోదావరి ఒడ్డుకు వెళ్ళాం నేనూ, మా నాన్నగారూ. రోజూ అలా కాసేపు నడిచిరావడం మా ఇద్దరికీ అలవాటు. అప్పుడప్పుడూ ఆయన నదిలో ఈతకొడుతూ ఉండేవారు. నేను ఇసుకలో పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటూ ఉండేదాన్ని.

'ఆ రోజు గోదావరి ఉధృతంగా ఉంది. వరదవచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఆయన స్విమ్మింగ్ ట్రంక్స్‌లోకి మారబోతుంటే నేను వారించేను. కానీ ఆయన లక్ష్యపెట్టకుండా నదిలో దిగారు.

'నేను నా పుస్తకంలో మునిగిపోయాను. రెండు పేజీలు చదివి తలెత్తి చూశాను. అప్పటికే ఆయన సుడిగుండంలో ఇరుక్కుపోయి నిస్సహాయంగా కేకలు పెడుతున్నారు.

ఏం చెయ్యను. ఏం చెయ్యగలను? జన్మనిచ్చిన తండ్రి....రక్తం పంచిన తండ్రి....నా కళ్ళముందే ప్రకృతి విలయతాండవానికి బలైపోతుంటే, దిక్కుతోచక అటూ ఇటూ పరుగులు తీశాను... ఆ సమయంలో ఆ నిర్మానుష్యమైన ప్రదేశంలో ఎవరూ ఉండరని తెలిసీ అరిచాను.... మొత్తుకున్నాను.... వలవలా ఏడ్చాను....కానీ ఎవరు వింటారు నా గోడు....నాది అరణ్యరోదనే అయింది .. అయిపోయింది. నా కళ్ళముందే ఆయన నదిలో ఐక్యమైపోయారు.

'నువ్వే నా స్థితిలో ఉంటే....కనీసం అక్కడుంటే ఏంచేసి ఉండేవాడివి శశీ?'

ఊహించని ఆ ప్రశ్నకు దిమ్మెరపోయాను....నా మనసులో ప్రచండ ఘోషలు మెదడులో వేయి సమ్మెటల పోట్లు....శరీరమంతా వాటి తాలూకు ప్రకంపనాలు. హండ్‌రెస్ట్‌ను గట్టిగా పట్టుకున్నాను.

పారిస్ ఓర్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఫ్లైట్ లాండవబోతోంది.

గోళ్ళకున్న పాలిష్ చూసుకుంటూ అందామె.

కానీ నేననుకున్నట్టు ఆ ప్రదేశం అప్పుడు నిర్మానుష్యం లేదు శశీ. జరుగుతున్నదంతా చూస్తూ చెట్లచాటున నిలబడి ఉన్నాడో వ్యక్తి. అతను కూడా తెలుసు .... అతనికి ఈత పోటీల్లో ప్రథమ బహుమతులు రావడం నాకు బాగా తెలుసు. గోదావరి ఈ చివర్నించి ఆ చివరిదాకా ఆగకుండా ఈదగల సత్తా ఉందనీ తెలుసు. కానీ....కానీ అక్కడ అతని ఉనికి నాకు తెలుసునని అతనికిప్పటివరకు తెలియదు.

'ఓ వ్యక్తి, అతనెలాంటివాడైనా చచ్చిపోతుంటే....శక్తి ఉండీ రక్షించకపోవడం హత్యచెయ్యటం కన్నా మెరుగంటావా!'

నాకు ఒళ్ళంతా చెమటలు....నా తల పాతాళంలోకి కుంగిపోతున్న అనుభూతి ఎవరో నన్ను ముక్క ముక్కలుగా చీలుస్తున్న భావన....చిత్రహింస.

చిన్నగా నవ్విందామె.

'నాకతను బాగా తెలుసు ప్రపంచంలో ఎక్కడున్నా గుర్తుపట్టగలను. అతన్ని కలిశాను కూడా... కానీ నిందించడానికి ప్రయత్నించలేదు. ఓ స్నేహితుడిగానే ట్రీట్ చేశాను....ఎటొచ్చీ....'

'స్టాపిట్ సుధా....ప్లీజ్...ఫర్ గాడ్స్ సేక్ స్టాపిట్.' మరు నిమిషంలో నేను కొలాప్స్ అయిపోతాను.

'లోకంలో ఎవరూ పరిపూర్ణులుకారు శశీ....అందరికీ ఉంటాయి బలహీనతలు. నా అహం నా బలహీనత... నీ పగ నీకు బలహీనత... మా నాన్నగారికి ఆయన అధికారదాహం. మీ అరుణ్‌కు తొందరపాటు ..ఏదో లోపం లేనిదెవరికి. ఆఖరికి దేవుడనే వాడొకడుంటే అందరికన్నా పెద్ద బలహీనత వాడికీ ఉంది. అదే ఈ అవకతవకల సృష్టి.

ఎదుటివాణ్ని విమర్శించే అర్హత ఎవరికీ ఎప్పుడూ లేదు ఐనా అది సహజం కానీ నిందించడం, మాటల్లో మనసుల్ని రంపపుకోత కొయ్యడం కేవలం మానసికంగా పతనమైపోయిన రాక్షసులు శాడిస్టులు చేసేపని. వాళ్ళకు నిష్కృతి లేదు. కానీ, అంతో ఇంతో చదువుకుని మిగతా వారికన్నా అన్నిట్లోనూ ఓమెట్టు పైన ఉన్నవారు, ఇంకొంచం హుందాగా మనుషుల్లా ప్రవర్తించాలి.'

లేచిందామె.

మేమిద్దరమే మిగిలాం విమానంలో ఎయిర్ హోస్టెస్ వింతగా చూస్తోంది.

'ఉంటాను శశీ....మళ్ళీ కలుస్తాం ఎప్పుడో, ఎక్కడో. ప్రపంచం చాలా చాలా చిన్నది. మనిషికున్న గుప్పెడు మనసుకన్నా ఎంతో చిన్నది. కాబట్టిమన కలయిక తప్పనిసరి. అప్పటి వరకూ గుడ్‌బై!....

ప్రతి మనిషి అంతరాంతరాలలో కొన్ని చీకటికోణాలుంటాయి. తనంత తాను వాటిలో దాక్కున్న నిజాల్ని ఆవిష్కరించుకోవాలంటేనే ఎంతో భయపడతాడతను. అటువంటిది. ఎదుటివాళ్ల ఒక్కసారిగా వెయ్యిదీపాల వెలుగుల్ని వాటి మీదకు విరజిమ్మితే తట్టుకోవడం చాలా కష్టం.

ఎన్నడూలేని నీరసం నన్నావహించింది. నిలబడబోతూ, కొంచెం తూలాను.

'సమ్. థింగ్ రాంగ్ సర్?' అంది ఎయిర్ హోస్టెస్ నా భుజం పట్టుకుంటూ.

'ఎస్ ది లైఫ్ ఇట్ సెల్ఫ్' అంటూ ముందుకు కదిలాను.